## సామెత (జాతీయముల )కథలు

# ప్రత్యక్ష పురాణం

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

శ్రీ కృష్ణదేవరాయులు తన యాస్థానమున ఒక్కనాడు అష్టదిగ్గజకవులు దేశదేశాల నుండి వచ్చిన యుద్ధండ పండితుల నోడించి రామలింగకవి సభాగౌరవం దక్కించుకొన్న సంగతులను వినోదంగా జెప్పుకొని మురిసిపోవుచుండిరి.

అంతలో నొక రసికుడు రొప్పుచూ వచ్చి, రాయులవారికి మ్రొక్కి "అయ్యా! ఒక్క మనవి. నెల్లూరి నెరజాణల నేరాలు రోజురోజుకు పెరిగిపోవుచున్నవి. తెలివితేటలలో మమ్ములను మించిన వారు లేరని విఱ్ఱవీగుచున్నారు. వారికి తగుబుద్ధి చెప్పలేక పోయినచో నా పట్టణమున పురుషులు తలయెత్తుకొని తిరుగుట కష్టమగును. కావున వారికి గర్వభంగము చేయించి మా తాపములు చల్లార్పుడు" అని ప్రార్థించెను.

రాయులు రామకృష్ణునుద్దేశించి "కవివర్యా! ఇట్లాంటి ఘట్టాలలో మీ బుద్ధి అమోఘంగా పని చేయును. మీకు మా అండదండలు కలవు. మీపై ఈగ వ్రాలకుండజూతుము. నయముననో భయముననో వారి యాట కట్టింపుడు" అని యానతిచ్చెను. రామలింగకవి "అట్లే ప్రయత్నింతు"నని మాట యిచ్చెను.

ఒక రోజున రామకృష్ణ కవి నెల్లూరు చేరి, ఒక పూటకూటి ముసలమ్మ యింట బస చేసెను. ఆమెతో కొన్ని మంతనములు సాగించి, నెల్లూరున ప్రసిద్ధి పొందిన యొక నెరజాణ వేశ్య యింటికి తాను వచ్చుచున్నట్లు కబురు చేసెను. రామకృష్ణకవి పేరు కీర్తులు పూర్వమే వినియున్నదగుటచే ఆమె తన సంపూర్ణాంగీకారమును వెల్లడించెను. ఆతని నోడించుచో నెల్లూరి నెరజాణల ప్రసిద్ధి యింకను దేశదేశాలలో పెరుగ గలదని సంతసించెను.

రామకృష్ణకవి కాశ్మీరు శాలువ కప్పుకొని పెట్టెడు నగలను పుస్తకాలను వెంట మోయించుకొని రాగా వేశ్యయు, ఆమె తల్లియు సగౌరవముగా నెదురేగి తోడ్కొని వచ్చి ఆతనిని తగిన యాసనమందు గూర్చుండబెట్టిరి. సమస్తోపచారములు చేసిరి. అటుపై వారు "ఓ రామకృష్ణ కవీ! మీరు మహాపండితులు. మహా కవులు అని మాత్రమే విన్నాము. మీ సంపదను ప్రవరాఖ్యుని వంటి మీ సురూపమును జూచి నేడు మేము ముగ్ధులమైనము. మీ సరసత్వమెట్టిదో మాకు తెలుపుదురు గాక. మాకు తెలియునట్లు ప్రత్యక్షముగా కన్నుల పండువ చేయునట్లు ఏదైనా యొక పురాణ గాథను శ్రావ్యముగ నవరస భరితముగ వినిపింతురు గాక" యనిరి.

రామకృష్ణుడు "సుందరీ! ఇదెంత భాగ్యము! వ్యాసమహర్షి, వాల్మీకి మహర్షి వ్రాసిన పురాణములలో నేయొక్క గాథనైనా కన్నుల పండువగా, చెవుల విందుగా ప్రదర్శించి మీ కోర్కె తీర్తును. పురాణము చెప్పుచుండగా సొంతం చూడనిదే, విననిదే ఆపుమన్నచో ఒప్పుకొనను సుమా!" యనెను.

"కవిగారు! ఆదికవియైన వాల్మీకి వ్రాసిన రామాయణం అత్యంత రమణీయంగా ఉంటుంది. నేటికి ఆపురాణంలోని గాథ ఒక్కటి సెలవివ్వండి." అనెను. కవి తన పాచిక పారిందని మకాము చేరి సుఖంగా భోజనం చేసి, సుగంధ ద్రవ్యాలతో గూడిన తాంబూలం సేవించి, సమస్త సంభారాలతో ఠీవిగా వేశ్య యిల్లు చేరెను. విజయము కవిదో? వేశ్యదో చూడాలని వేడ్కతో పక్కురు వేశ్యలు ఊరి పెద్దలు విచ్చేసిరి.

కవి ప్రత్యక్షరామాయణ పురాణ పఠనం ఆరంభించెను. పద్యములు శ్రావ్యముగా చదువుచు ఆంజనేయస్వామి రాముని వద్దనుండి ఉంగరం తీసికొని, ఆకాశంలో సముద్రలంఘనము ఈవిధంగా చేశాడని పంచె బిగించి, అచ్చటనున్న ఘోషాణమెక్కి, పందిరి మంచము మీదికి గుభాలున దుమికెను. ఆ మంచము ఫెళ్ళుమని విరిగిపోయెను. అటనుండి లంకలోనికి దూకి లంకిణి నొక్క పోటు పొడిచెనని వేశ్య తల్లి గుండెలలో నొక్క పోటు పొడిచెను. ఆ వాకిటనే యున్న ఒక చెట్టెక్కి ఆంజనేయునివలె సీతకు రామసందేశం వినిపించెను. అటుపై చెట్టు కొమ్మలు విఱిచి, రాక్షసుల నిట్లు బాదెనని యచ్చట నున్న వారినెల్ల కొమ్మలతో గొట్టెను. రావణుడు ఆంజనేయుని తోకకు నిప్పంటించగా లంకనిట్లు దహనము చేసెనని అప్పటికే తాను తెచ్చికొనియున్న నూనె గుడ్డలతో నాల్గువైపుల భవనమంటించెను. ఆంజనేయుడు సీతనిట్లు రక్షించెనని చెప్పుచూ వేశ్యను లోనుండి బరబర యీడ్చి వెలుపల విసరివైచెను. ఈ లోపున ఎందఱు గోల పెట్టినా ఊరు వాడ యేకమై గగ్గోలు చేసినా లంకాదహనము ప్రదర్శించక విడువలేదు. ఆపై అచ్చటనే నిలువ చేసి యుంచుకొన్న జలముతో సముద్రాన యీ విధంగా తన చేతులు కాళ్ళు కడుగుకొనెను. "సభ్యులారా! ప్రత్యక్ష పురాణంలో కొంత భాగం ముగిసింది. ఇక మీ యిండ్లకు పొండు" అని తాను తన మకాముకు వెడలిపోయెను.

మర్నాడు ఆ వేశ్య తదితర వేశ్యల మద్ధత్తుతో న్యాయధికారి వద్ద తగవు తెచ్చెను. న్యాయస్థానమున రామకృష్ణకవి జరిగినదెల్ల వేశ్య కోరినదెల్ల పూస గ్రుచ్చినట్లు వివరించి చెప్పెను. తుచాలు తప్పకుండా విన్న అందున్న ప్రేక్షకులెల్లరు సాక్ష్యమిచ్చిరి. వేశ్య యొక్క పొగరుకు తగిన శిక్ష, ప్రాయశ్చిత్తము జరిగినదని సర్వులును మెచ్చుకొనిరి. న్యాయాధికారియు రామకృష్ణుని తప్పు ఏ కొంచెమును లేదని తెలియజేసెను. ప్రత్యక్షపురాణం సుందరకాండము నవరసభరితంగా చెప్పుమని కోరిన వేశ్యదే యీ తప్పని తీర్పు ఇచ్చెను.

*** ********* ***

*వచ్చే సంచికలో "తెర వెనుక భాగవతము" గురించి తెలుసుకుందాం.*

**మీకు తెలుసా?**

కౌరవులలో 'చిత్ర'తో మొదలయ్యే పేర్లు 12 ఉన్నాయి.

| | | | |
|---|---|---|---|
| 1. చిత్రయోధి | 2. చిత్రుడు | 3. చిత్రాక్షుడు | 4.చిత్రధ్వజుడు |
| 5. చిత్రరథుడు | 6. చిత్రభానుడు | 7. చిత్రభాణుడు | 8. చిత్రవర్ముడు |
| 9. చిత్రసేనుడు | 10. చిత్రవర్మభృత్ | 11. చిత్రజాసనుడు | 12. చిత్రకుడు |

***